అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

కలెక్టరేట్, జనవరి 29: డా.బీఆర్ అంబేడ్కర్ విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో(ఇంగ్లీషు మీడియం) ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని, అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. విద్యార్థులు సొంత జిల్లాలో మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. మరింత సమాచారం కోసం సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సమన్వయాధికారి కార్యాలయాన్ని కానీ, ఏదైనా సాంఘిక సంక్షేమ గురుకుల ప్రధానాచార్యులను కానీ సంప్రదించాలని కోరారు.



టీడీపీ హయాంలో నిర్మించిన రహదారి


పూడిలంకకు దారేది?

- ఏళ్ల తరబడి జలదిగ్బంధంలోనే..
- వర్షాకాలంలో రాకపోకలు బంద్
- టీడీపీ హయాంలో కొంతమేర రహదారి పనులు
- ఎన్నికల హామీని నెరవేర్చని వైసీపీ నేతలు
- గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు

గ్రామం చుట్టూ ఉప్పుటేరు. రోడ్డు సౌకర్యం లేదు. వర్షం పడితే బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయి.. గ్రామస్థులంతా బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. టీడీపీ హయాంలో రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టగా ఎన్నికలు సమీపించడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. పక్కా రోడ్డు నిర్మిస్తామని వైసీపీ నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చినా.. అధికారంలోకి వచ్చిన దాని ఊసే లేదు. దీంతో తమకు ఏళ్ల తరబడి కష్టాలు తప్పడం లేదంటూ పూడిలంక వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి దారి చూపాలంటూ అధికారులు, పాలకులను వేడుకుంటున్నారు.

(వజ్రపుకొత్తూరు)

వజ్రపుకొత్తూరు మండలం పూడిజగన్నాథపురం పంచాయతీ పరిధి పూడిలంక గ్రామస్థులకు ఏళ్ల తరబడి రహదారి సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ గ్రామంలో 50కి పైగా ఇళ్లు ఉన్నాయి. 250మంది జనాభా. 100 ఏకరాల పంట పొలాలు ఉన్నాయి. నిత్యం వీరు రకరకాల కూరగాయాలు పండిస్తూ చుట్టుప్రక్కల గ్రామాల్లో విక్రయించి జీవనం సాగిస్తున్నారు. గ్రామం చుట్టూ ఉప్పునీరు పారుతుంది. వర్షాకాలంలో ఉప్పునీరు ఉధృతి పెరిగి గ్రామం జలదిగ్బంధం అవుతుంది. గ్రామస్థులకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అలా కొన్ని రోజులపాటు వారు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. వైద్యం, ఇతర అత్యవసర సేవలు కూడా పొందక అనేక ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. వందల ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా.. నేటికీ రహదారి మోక్షం లభించడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంక గ్రామానికి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ రూ.1.30 కోట్లు నిధులతో పనులు చేయించారు. ఇంతల్లో సార్వత్రిక ఎన్నికలు రావడంతో రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. గ్రామానికి పక్కా రోడ్డు నిర్మిస్తామని వైసీపీ నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చినా నేటికి ఎలాంటి పనులు చేపట్టలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాలిబాట కోతకు గురవడంతో.. ఈ రహదారిపై నడవడం కత్తి మీద సాములా ఉందని వాపోతున్నారు. పొరపాటున కాలు జారితే ఉప్పుటేరులో కొట్టుకుపోవాల్సిందేనని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పక్కా రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఉప్పుటేరు వరద ఉధృతికి కొట్టుకుపోయిన నడకదారి

టీడీపీ హయాంలోనే అభివృద్ధి



టీడీపీ హయాంలోనే పూడిలంక గ్రామానికి కొంతమేర అభివృద్ధి చేశారు. గ్రామానికి నడక దారి కోసం అప్పట్లో రూ.10లక్షల నిధులు మంజూరు చేశారు. అత్యవసరసమయంలో నీటిలో రాకపోకల కోసం మరబోటు అందించారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ ఆధ్వర్యంలో రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. గ్రామానికి పక్కా రోడ్డు నిర్మిస్తామని వైసీపీ నాయకులు హామీ ఇచ్చినా.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కనీసం మధ్యలో నిలిచిన పనులు పూర్తిచేసినా.. రహదారి సమస్య కొంతమేర పరిష్కారమయ్యేది.

-తిమ్మల కృష్ణారావు, మాజీ సర్పంచ్

ప్రతిపాదనలు పంపించాం

పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంక వరకు రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

- రామకృష్ణ, డీఈ, పంచాయతీరాజ్

జగన్‌కు ఓటు అడిగే నైతిక హక్కులేదు

- వారి హామీలు గాలిలో కలిశాయి
- వచ్చే ఎన్నికల్లో వైసీపీని సాగనంపుదాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

టెక్కలి/నందిగాం, జనవరి 29: 'సీఎం జగన్.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోయాయి. వైసీపీ పాలనలో ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేరలేదు. అందుకే రాష్ట్ర ప్రజలకు ఓటు అడిగే నైతిక హక్కు సీఎం జగన్మోహన్‌రెడ్డికి లేదు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సోమవారం నందిగాం మండలం మర్లపాడు, కవిటిఅగ్రహారం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమాలను నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి అచ్చెన్న.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను, టీడీపీ ఎన్నికల మెనిఫెస్టోను వివరించారు. '2019లో ఒక్క అవకాశం పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి అన్ని వర్గాలను ముంచేశారు. దేశంలో ఎక్కడైనా ఆంధ్రా పేరు చెబితే ప్రజలు అసహ్యించే పరిస్థితికి తీసుకువచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి వందేళ్లు వెనక్కి వెళ్లిపోయింది. మద్యపాన నిషేధంపై జగన్ హామీ ఇచ్చి.. చివరకు ఆయనే మద్యం తయారుచేయిస్తున్నారు. నాసిరకం మద్యం తాగి రాష్ట్రంలో 30వేల మంది చనిపోయారు. ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్‌చార్జీలు పెంచారు. నాలుగున్నరేళ్లలో రూ.14లక్షల కోట్లు ఖర్చు చేశామని, అందులో రూ.2లక్షల కోట్లు బటన్ నొక్కి ప్రజలకు అందజేశామని చెబుతున్నారు. మిగిలిన రూ.12లక్షల కోట్లు ఏమయ్యాయి?' అని అచ్చెన్న ప్రశ్నించారు. స్థానిక సంస్థలు, పంచాయతీలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వైసీపీని సాగనంపాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో 160 స్థానాల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, మళ్ల బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర్, కొల్లి హరిబాబు, కొన్ని ప్రసాద్, మహేష్, మదన్‌గౌడ్, జీరు మోహనరావు, బంగారు బారికి, శివ, జనసేన నాయకులు చిరంజీవి, పల్ల బాలకృష్ణ పాల్గొన్నారు.



అచ్చెన్నాయుడుతో కరచాలనం చేస్తున్న మహిళలు

విద్యుత్ చార్జీలు పెంచబోం

- ఈ ఆర్థిక సంవత్సరం భారం మోపబోము: ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్
- 2024-25 ఆదాయ అంచనాలు రూ.21,162 కోట్లు
- ప్రతిపాదిత ధరల రాబడి రూ.100.44 కోట్లు
- ఒక్కరైల్వే ట్రాక్షన్ చార్జీలు యూనిట్‌కు రూపాయి పెంపునకు ప్రతిపాదన

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ఈ (2024-25) ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి భారం మోపడం లేదని, చార్జీలు పెంచడం లేదని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ సోమవారం నిర్వహించిన టారిఫ్ ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని డిస్కమ్ ప్రగతిని, ప్రతిపాదనలు వివరించారు. కేవలం రైల్వే ట్రాక్షన్ చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు ధర 40శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ.100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత పర్ కాస్ట్ రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని స్పష్టంచేశారు.



మాట్లాడుతున్న సీఎండీ పృథ్వీతేజ్

కొనుగోలు ఖర్చు యూనిట్ రూ.4.69

రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు.

● కొత్త ఆర్థిక సంవత్సరంలో గృహ వినియోగం 7,741.84 మిలియన్ యూనిట్లు ఉంటుందని, దాని ద్వారా రూ.3,764.76 కోట్లు వస్తుందని అంచనా వేశారు. వాణిజ్యానికి 1,501.26 మి.యూ. ఇవ్వడం ద్వారా రూ.1,534.45 కోట్లు వస్తుందని, పరిశ్రమలకు 494.59 మి.యూ. ఇవ్వడం వల్ల రూ.406.87 కోట్లు వస్తుందని, వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలకు 4,767.55 మి.యూ. ఇస్తే రూ.1,000.71 కోట్లు వస్తాయని, సంస్థాగతంగా 508.32 మి.యూ.కు రూ.384.32 కోట్లు రావచ్చునని మొత్తం చూసుకుంటే ఎల్‌టీ విభాగంలో 15,013.56 మి.యూ.కు రూ.7,091.11 కోట్లు వస్తాయని అంచనాలు చూపించారు. అదే హెచ్‌టీ విభాగంలో అయితే 14,840.50 మి.యూ.కు రూ.10,673.34 కోట్లు వస్తుందని వివరించారు.



ఆక్రమణకు గురైన చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరావు

ఆ చెరువు స్థలం ప్రభుత్వానిదే

- వైసీపీ ప్రజాప్రతినిధి ఆక్రమణపై తహసీల్దార్ విచారణ
- హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

శ్రీకాకుళం క్రైం, జనవరి 29: శ్రీకాకుళం మండలం సింగుపురంలో ముసలం గుండం చెరువు ఆక్రమణలను అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దశాబ్దాల చరిత్ర కల్గిన ఈ చెరువును ఆక్రమించేందుకు స్థానిక అధికారపార్టీ నేత యత్నించాడు. దీనిపై ఆంధ్రజ్యోతిలో 'దర్జాగా చెరువు కబ్జా' పేరిట ఆదివారం కథనం ప్రచురితమైంది. అలాగే సోమవారం అధికారపార్టీ ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీలు, గ్రామస్థులు జడ్పీలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో చెరువు ఆక్రమణ విషయమై జేసీ నవీన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జేసీ స్పందిస్తూ తక్షణమే నివేదిక అందజేయాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావును ఆదేశించారు. తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆక్రమణకు గురైన చెరువును పరిశీలించి అవాక్కయ్యారు. ఆనవాళ్లు మొత్తం చెరిపేసేలా చెరువును కప్పేశారని ధ్రువీకరించారు. ఓ వైపు తహసీల్దార్ పరిశీలిస్తుండగానే.. మరోవైపు ఆక్రమణదారులు చెరువులో నీటిని ఇంజన్లతో తోడించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చెరువు కొండపోరంబోకు స్థలంగా తహసీల్దార్ గుర్తించారు. రెవెన్యూ రికార్డుల్లో 184 ఎకరాల కొండ పోరంబోకు స్థలం ఉందని, అందులో ఆక్రమణకు గురైన సర్వే నెంబర్ 270/4లో ప్రభుత్వ బంజరు భూమి 9.15 ఎకరాలు ఉన్నట్టు తెలిపారు. ఈ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే శిక్షార్హులని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. చెరువును కంపోస్టు బూడిదతో కప్పేసి ఆక్రమణకు పాల్పడినట్లు జేసీకి నివేదిక అందజేశారు. ఇదిలా ఉండగా.. తహసీల్దార్ పరిశీలించి వెళ్లిన వెంటనే స్థానిక అధికారపార్టీ నేత అక్కడకు చేరుకున్నారు. చెరువు స్థలం తనదేనని.. తనపై ఎవరు ఫిర్యాదు చేశారంటూ రంకెలేశారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వారి సంగతి తేలుస్తానంటూ హల్‌చల్ చేశారు. సొంత పార్టీ నాయకులే తనపై ఫిర్యాదులు చేయించారని, వారి ఆక్రమణలు కూడా బయటపెడతానని తెలిపారు.



చెరువు స్థలం వద్ద హెచ్చరిక బోర్డు

● 'చెరువును అధికారం అడ్డం పెట్టుకుని కొందరు ఆక్రమించడం దారుణం. ఈ చెరువును కంపోస్టు బూడిదతో కప్పేశారు. చెరువులో నీటిని మనుషులు కానీ పశువులు కానీ తాగితే ప్రమాదమే. అధికారులు స్పందించి బూడిదను పూర్తిగా తొలగించాలి' అని ఎంపీటీసీ బగ్గు అప్పారావు అన్నారు. 'మా తాతల కాలం నుంచి ఈ చెరువును చూస్తున్నాను. చెరువును పునరుద్ధరించాలి' అని మాజీ సర్పంచ్ గుండ మోహన్‌రావు డిమాండ్ చేశారు.

40 మంది ఎస్‌ఐల బదిలీ

శ్రీకాకుళం క్రైం, జనవరి 29: రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 40 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ సోమవారం ఎస్పీ జీఆర్ రాధిక ఉత్తర్వులు జారీ చేశారు. సరుబుజ్జిలి ఎస్‌ఐ కృష్ణప్రసాద్‌ను గార, బూర్జ ఎస్‌ఐ బి.అశోక్‌బాబు నరసన్నపేట, విజయనగరంలో ఉన్న పి.సిద్దార్థకుమార్‌ను సంతబొమ్మాళికి, ట్రాఫిక్ ఎస్‌ఐ ఎం.హరికృష్ణను శ్రీకాకుళం టూటౌన్‌కు బదిలీ చేశారు. కాశీబుగ్గ ఎస్‌ఐ-1 ఎస్‌కే ఖాదర్ బాషాను పొందూరుకి, డీపీటీసీ శ్రీకాకుళం ఎస్‌ఐ జి.ప్రభాకరరావును దిశకు, వీఆర్‌లో ఉన్న సీహెచ్ స్వామినాయుడును లావేరుకి, విశాఖ సిటీలో ఉన్న ఎల్.చంద్రశేఖర్‌ని బూరువాకి, వీఆర్‌లో ఉన్న బి.అనిల్ కుమార్‌ను మందసకి, ప్రవల్లికను దిశకి, సీహెచ్ హేమంత్‌కుమార్, ఎస్‌వీ రమణలను డీఎస్‌బీకి, కె.వెంకటేష్‌ను సీసీఎస్‌కు బదలాయించారు.

● దిశలో ఉన్న వి.నేతాజీని డీసీఆర్‌బీకి, కాశీబుగ్గలో ఉన్న వి.గోపాలరావును, సీసీఎస్‌లో ఉన్న ఎల్.బలుడును వీఆర్‌కి పంపించారు. సీసీఎస్‌లో ఉన్న కేశవరావు, కె.కృష్ణారావు ఎస్‌బీకి, ఎస్‌బీ అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎస్.శ్రీరంగులు, ఎస్.నారాయణని కంట్రోల్‌రూమ్‌కి, అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎస్.కారయ్యను, సీసీఎస్‌లో ఉన్న కె.మోహన్‌రావును పోలీసు కంట్రోల్ రూమ్‌కి బదిలీ చేశారు.

● వీఆర్‌లో ఉన్న ఎం.సురేంద్ర కుమార్‌ను సీసీఎస్‌కు, అనకాపల్లిలో ఉన్న యు.రాజారావును వీఆర్ శ్రీకాకుళం, వీఆర్(శ్రీకాకుళం)లో ఉన్న ఎం.వెంకటరావును కాశీబుగ్గ- 2 ఎస్‌ఐగా బదలాయించారు. అనకాపల్లిలో ఉన్న షేక్‌రషీద్‌ను శ్రీకాకుళం వీఆర్‌కి జె.నాగేశ్వరరావును శ్రీకాకుళం డీపీటీసీకి, వీఆర్‌లో ఉన్న విశ్వనాథం, పి.ప్రసాదరావులను సీసీఎస్‌కు, ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. అనకాపల్లిలో ఉన్న కె.సత్యనారాయణను శ్రీకాకుళం వీఆర్‌కి, వీఆర్ (శ్రీకాకుళం)లో ఉన్న పి.వారి, పీవీ వెంకటరమణ, షేక్ మదీనావళిలను ట్రాఫిక్‌కు, శ్రీకాకుళం టూటౌన్-2, సీసీఎస్ ఎస్‌ఐలుగా నియమించారు.

● శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న డి.సూరిబాబు, కె.నర్సింగరావు, పిడిబి శంకర్, పి.మురళీకృష్ణను సీసీఎస్, ఎస్‌బీ, సీసీఎస్, డీపీటీసీలకు బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయిన యు.భవాని, కె.గోవిందరావును శ్రీకాకుళం దిశకు, సీసీఎస్‌లకు, విశాఖకు బదిలీ అయిన కె.శ్రీనివాసరావును శ్రీకాకుళం దిశకు బదలాయిస్తూ ఉత్తర్వులిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా పెన్షనర్ల సంఘం డిమాండ్

కలెక్టరేట్, జనవరి 29: 'సుదీర్ఘకాలంపాటు ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వర్తించాం. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత సక్రమంగా పెన్షన్లు అందడం లేదు. సంవత్సరాల కొద్దీ డీఏ, పీఆర్సీ బకాయిలు రాక ఇబ్బందులు పడుతున్నామ'ని పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం కలెక్టరేట్ సమీపంలోని మహాత్మాజ్యోతిబాపూలే పార్కువద్ద రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో వారు నిరసన చేపట్టారు. నిరసన శిబిరాన్ని ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరాం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల పోరాటానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 'పెన్షనర్లకు ప్రతినెలా 1న డబ్బులు చెల్లించాలి ప్రధానంగా అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ అమలు చేయాలి. 2018 నుంచి డీఏ బకాయిలు, 2022 నుంచి రావాల్సిన పిఆర్సీ బకాయిలు వెంటనే విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాలి. పెన్షనర్లకు కూడా ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్య సదుపాయం కల్పించాలి. సమస్యల పరిష్కారంపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించాల'ని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో నేతలు రాయి వేణుగోపాలం, బడగల పూర్ణచంద్రరావు, ఎస్‌జీపీఏ శ్రీకాకుళం అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఎం.ప్రభావతి, వైస్ ప్రెసిడెంట్ ఎస్.వి.రమణ, జాయింట్ సెక్రటరీ డిల్లేశ్వరరావు, బి.సూర్యప్రకాష్, జీవీ రమణ, జమ్మయ్య, సోమేశ్వరరావు, జి.కృష్ణారావు, మన్మధరావు, భానోజీరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ సమీపంలో ధర్నా చేస్తున్న పెన్షనర్లు



ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్

డ్వాక్రా మహిళలు వైసీపీ నేతలు నిర్వహించిన ఆసరా సమావేశానికి వచ్చారు. అయితే భోజనం కాదు కదా.. కనీసం తాగేందుకు నీరు కూడా వారికి ఏర్పాటు చేయలేదు. దీంతో వారంతా ఆకలితో అలమటించిపోయారు. దీంతో మధ్యాహ్నం సమీపంలో టీడీపీ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌కు వెళ్లారు. ఆకలి తీర్చుకున్నారు. రోజూ 300 మందికి అన్నం పెట్టగా.. సోమవారం అదనంగా వంద మందికి వడ్డించామని అన్నక్యాంటీన్ నిర్వాహకులు తెలిపారు. కోటబొమ్మాళిలో సోమవారం ఈ ఉదంతం చోటుచేసుకుంది.

- కోటబొమ్మాళి

గ్రామాల్లో కొనసాగుతున్న 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

టీడీపీ అధిష్ఠానం పిలుపు మేరకు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ, పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న పథకాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు.

జగన్‌ను ఇంటికి పంపించండి: బగ్గు

నరసన్నపేట, జనవరి 29: రాష్ట్ర భవిష్యత్‌ను నాశనం చేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపించాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలోని తిరుమలవీధి, బొంతలవీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క చాన్స్ ఇవ్వండని ప్రజలను మభ్యపెట్టి అధికారంలో వచ్చిన సీఎం జగన్ ప్రజలను, రాష్ట్ర భవిష్యత్‌ను నట్టేట ముంచాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని, చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రం మరలా గాడిలో పడుతుందన్నారు. బొంతలవీధిలో వైసీపీ నాయకుడు బోడల రవీంద్రనాథ్ ఠాగూర్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కింజరాపు రామారావు, నాయకులు గొద్దు చిట్టి బాబు, ఉణ్న వెంకటేశ్వరరావు, బెవర రాము, కోరాడ రామచంద్రరావు, నేతింటి విశ్వేశ్వరరావు, సరియాపల్లి మధు, బోయన సతీష్, తంగి తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● పలాసరూరల్: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని టీడీపీ నాయకులు అన్నారు. చిన్నంచల గ్రామంలో సోమవారం పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రకటించిన ఆరు పథకాలను ప్రజలకు వివరించి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పీరికట్ల విఠల్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ రావు, నాయకులు దువ్వాడ సంతోష్‌కుమార్, పోలాకి పాపారావు, టి.గంగారామ్, హోరియా మోహనరావు పాల్గొన్నారు.

● వజ్రపుకొత్తూరు: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు అన్నారు. సోమవారం హుకుంపేటలో పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గోవింద పాపారావు, చింత యోగేష్, ఎంపీటీసీ చిట్టిబాబు, అట్టాడ రఘు, సూరాడ పెంటయ్య, కంబా దానేష్, మురుపింటి పాపారావు, కొత్తూరు అప్పారావు, వంక రామారావు, మదనాల జోగారావు పాల్గొన్నారు.

● హరిపురం: నారాయణపురం, మరకజోల గ్రామాల్లో సోమవారం పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అమలు చేయనున్న సంక్షేమ పథకాలను నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాసరి తాతారావు, జీఎస్ నాయుడు, ఎల్.రుద్రయ్య కె.వాసు, ఎస్.భీమారావు, బి.కర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● సంతబొమ్మాళి: టీడీపీ హయాంలోనే గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పడి అభివృద్ధి చెందాయని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. సోమవారం గొదలాం, తోటాడ గ్రామాల్లో పర్యటించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పిన వెంకటేష్, నేతలు వజ్జ ప్రభాకర్, కర్రి విష్ణుమూర్తి, సువ్వారి ప్రసాద్, పంగ అశిరినాయుడు, వసంతరావు, గోవిందరావు పాల్గొన్నారు.

● కోటబొమ్మాళి: టీడీపీ ప్రభుత్వంలోనే శిష్ట కరణాల సామాజిక వర్గానికి అన్ని విధాలా మేలు జరిగిందని టీడీపీ రాష్ట్ర శిష్టకరణాల సాధికారిక సమితి కన్వీనర్ అక్కుమహంతి రాజా అన్నారు. సోమవారం కోటబొమ్మాళిలో శిష్టకరణాల ఇళ్లకు వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం సంఘం జిల్లా కన్వీనర్ బలివాడ సత్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదాశివుని రాంబాబు, డబ్బీరు రఘు, స్థానిక నేతలు అంపలాం శ్రీనివాస రావు, బెహర రాజేష్‌కుమార్, నౌపాడ మురళిధర్, నౌపాడ హరిప్రభాకర్ పాల్గొన్నారు. ● ఉప్పరపేటలో సోమవారం టీడీపీ నాయకులు భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ప్రమాణ పత్రాలను అందించారు. పూజారి శైలజ, ఉప్పాడ జయరాం, కోట అప్పన్న పాల్గొన్నారు.


నరసన్నపేట: వైసీపీ నాయకుడు రవీంద్రనాథ్ ఠాగూర్‌కు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న బగ్గు రమణమూర్తి

● జలుమూరు: టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు వెలమల చంద్రభూషణ రావు అన్నారు. తిమడాం గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను వివరించారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కంచిలి: చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నాయకుడు మాదిన రామారావు అన్నారు. సోమవారం అంపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మ్యానిఫెస్టోపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం రూరల్: చంద్రబాబుతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దక్కత కామేశ్వరరావు అన్నారు. సోమవారం సన్యాసిపుట్టుగ, కేశుపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పనపాన పురుషోత్తం, గుజ్జు భీమారావు, నరేంద్ర, రామారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యం కావాలి

ఎల్.ఎన్.పేట: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్ నాయుడు, కె.చిరంజీవి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలమట మాట్లాడుతూ.. సీఎం జగన్ ఆధ్వర్యంలో పాలన అధోగతి పాలైందని, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో నాయకులు ఎస్. కిషోర్‌కుమార్, కె.తిరుపతిరావు, టి.అప్పన్న, వి.చంద్రశేఖరరాజు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో మంత్రి ఒక్క రూపాయైనా ఖర్చు చేశారా?

పలాస: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ వార్డుల్లో మంత్రి అప్పలరాజు తన సొంత నిధులు ఒక్కరూపాయి అయినా ఖర్చు చేశారా అని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. వార్డుకు పోదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక 24వ వార్డు పురుషోత్తపురం, కొత్తవీధుల్లో ఆ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బీసీసెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు టంకాల రవిశంకర్‌గుప్తా, పార్టీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, నాయకులు గురిటి సూర్యనారాయణ, సైల చక్రధర్, యవ్వారి మోహనరావు, దడియాల నర్సింహులు, జోగ మల్లి, డొక్కర శంకర్, అంబటి కృష్ణమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పురుషోత్తపురం కాలనీలో అవగాహన కలిగిస్తున్న టీడీపీ నాయకులు


ఎల్ఎన్‌పేట: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణమూర్తి


కోటబొమ్మాళి: భవిష్యత్ గ్యారెంటీ నిర్వహిస్తున్న శిష్ట కరణాల సంఘ నేతలు


పలాస రూరల్: చినంచలలో పల్లెపల్లెకు టీడీపీలో పాల్గొన్న టీడీపీ నాయకులు


సంతబొమ్మాళి: గొదలాం గ్రామంలో సమావేశమైన టీడీపీ నాయకులు


జలుమూరు: తిమడాంలో భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహిస్తున్న వెలమల చంద్రభూషణరావు



హరిపురం: నారాయణ పురం, వజ్రపుకొత్తూరు: హుకుంపేటల్లో పల్లె పల్లెకు టీడీపీలో పాల్గొన్న నేతలు



ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగ, కంచిలి: అంపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ముళ్లపొదల్లో చిక్కుకున్న గుడ్ల గూబకు స్వేచ్ఛ



పలాస: తర్లాకోట పెద్దచెరువు వద్ద ముళ్లపొదల్లో చిక్కుకొని ప్రమాదస్థితిలో ఉన్న ఓ గుడ్లగూబను ఈస్ట్రన్ గార్డ్ వైల్డ్ సొసైటీ (ఈజీడబ్ల్యూఎస్) సభ్యుడు ఓంకార్ త్యాడి పట్టుకొని సోమవారం దానికి స్వేచ్ఛ కలిగించారు. వివరాలిలా ఉన్నాయి.. ప్రమాదవశాత్తు గుడ్లగూబ ముళ్లపొదల్లో చిక్కుకుని ఉండడాన్ని స్థానికులు గుర్తించి ఓంకార్ త్యాడికి సమాచారం అందించారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని గుడ్లగూబకు గుచ్చుకున్న ముళ్లను తొలగించి తరువాత దానిని చెరువు వద్దే విడిచిపెట్టడంతో ఎగురుతూ సమీప కొండల్లోకి వెళ్లిపోయింది. దీంతో స్థానికులు త్యాడిని అభినందించారు.

జీడికి గిట్టుబాటు ధర కల్పించడంలో నిర్లక్ష్యం

కాశీబుగ్గ: జీడికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చాపర వెంకటరమణ, డి.గోవిందరావు, సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ సీనియర్ నాయకుడు మద్దిల మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు గిట్టుబాటు ధర కోసం ఏడాదిగా పోరాటం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీఎం పలాస వచ్చిన సందర్భంగా చర్చించి గిట్టుబాటు ధర ప్రకటిస్తామన్న ఇచ్చిన హామీ ఏమైందని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో చాపర వేణు, గణపతి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారిగా సంతోష లక్ష్మి



వజ్రపుకొత్తూరు: నగరంపల్లి గ్రామానికి చెంది కర్రి సంతోష లక్ష్మి న్యాయాధికారిగా ఎంపికయ్యారు. సర్పంచ్‌గా సేవలందించిన సంతోష్ లక్ష్మి న్యాయశాస్త్రం చదికి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ పరీక్షలు రాసి అందులో ప్రతిభ కనబరిచి జూనియర్ సివిల్ న్యాయాధికారిగా ఎంపికయ్యారు. సర్పంచ్‌గా ఐదేళ్లపాటు గ్రామానికి విశేష సేవలు అందించారు. భర్త దువ్వాడ వెంకట్‌కుమార్ చౌదరి ప్రోత్సాహంతో పరీక్షలు రాసి విజయం సాధించినట్లు ఆమె తెలిపారు. సంతోష లక్ష్మి సివిల్ న్యాయాధి కారిగా ఎంపికవడంపై నగరంపల్లితో పాటు కన్నవారి గ్రామమైన మందస మండలం డబారు గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆమెను ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ మాజీ వీసీ హనుమంతు లజపతిరాయ్, రాజ్యలక్ష్మి దంపతులు, మాజీ సర్పంచ్ దువ్వాడ జయరాం చౌదరి, మురళి, లత, దువ్వాడ రమేష్‌కుమార్ చౌదరి తదితరులు అభినందించారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మణికంఠ

నరసన్నపేట: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు గుండువిల్లిపేట మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి లబ్బ మణికంఠ ఎంపికయ్యాడు. ఈ మేరకు సోమవారం క్రీడాకారుడికి సర్పంచ్ శంకరరావు, ఏఎస్ఐ తులసీదాస్ జూనియర్ కళాశాల మైదానంలో నగదు పారితోషికం, బ్యాడ్మింటన్ కిట్టును అందించారు. ఇటీవల సబ్ జూనియర్, అంతర్రాష్ట్ర పోటీల్లో ప్రథమ స్థానం పొందిన మణికంఠ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, ఈ పోటీల్లోనూ రాణించాలని వారు ఆకాంక్షించారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సలహాలు



నరసన్నపేట/పాతపట్నం: సబ్ జైలులో 18 ఏళ్ల లోపు ఉన్న ఖైదీలకు ఉచిత న్యాయ సలహాలను అందించనున్నామని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. సోమవారం నరసన్నపేట, పాతపట్నం సబ్ జైల్‌ను సందర్శిం చారు. ప్యానల్ లాయర్ లేదా పారా లీగల్ వలంటీర్ల ద్వారా న్యాయసలహాలను ఉచితంగా పొంద వచ్చన్నారు. ఖైదీలకు వైద్య సేవలపై ఆరా తీశారు. న్యాయవాదులు జి.ఇందిరాప్రసాదరావు, బీఈ సత్యనారాయణ, టి.మధుసూదనరావు, ఆర్.కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ రైల్వే కార్మికుల ధర్నా

పలాస: రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పలాస రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఒడిశా రాష్ట్రం బరంపురం రైల్వే ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ మట్ట రామకృష్ణ మాట్లాడుతూ.. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, రైల్వేశాఖలో ఒప్పంద కార్మిక వ్యవస్థను రద్దు చేసి పర్మినెంట్ కార్మికులను నియమించాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'తో చక్కని అవకాశం

నరసన్నపేట: ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు చక్కని అవకాశం లభించిందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేశారు. ఎంపీడీవో మధుసూదనరావు, ఎంపీపీ అరంగి మురళీ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పలాసరూరల్: సంతబొమ్మాళి మండలం గొల్లవానిపేటకి చెందిన గీతాలి నీలమ్మ (52) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆదివారం రాత్రి నీలమ్మ తన బంధువుతో బైక్‌పై వ్యక్తిగత పనిమీద వెళుతుండగా పలాస మండలం గరుడఖండి జంక్షన్ వద్ద జారి పడి తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు 108 వాహనంలో టెక్కలి ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త చిన్నయ్య ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జి.సంజీవరావు తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

టెక్కలి: దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని, 18 ఏళ్లు నిండి అర్హులైన దివ్యాంగులకు ఇళ్ల స్థలాలివ్వాలని, బస్సుపాస్‌లున్న దివ్యాంగులకు అన్ని బస్సుల్లో ప్రయాణానికి అవకాశం కల్పించాలని కోరుతూ దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఆ సంఘ అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్, మండల అధ్యక్షుడు పువ్వల చంద్రశేఖర్, కార్యదర్శి బమ్మిడి మాధవరావు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో పాల్గొని సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్రమీనాలకు వినతిపత్రం అంద జేశారు. సీపీఎం నాయకుడు నంబూరు షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితులను ఆదుకోండి

టెక్కలి: ఆఫ్‌షోర్ నిర్వాసితుల్లో అర్హులైన వారికి నేటికీ పునరావాస ప్యాకేజీలు అందలేదని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోనారి మోహనరావు, పొలిన శంకరరావు కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతిపత్రం అందజేశారు. మరికొన్ని వినతులిలా.. పింఛన్ మంజూరు చేయాలని టెక్కలి మెట్టవీధికి చెందిన దివ్యాంగురాలు గొడ్డు షర్మిల వినతి అందజేశారు. గ్రానైట్ క్వారీల్లో స్థానికులకు ఉద్యోగభద్రత లేకుండా పోయిందని, ఉపాధి కల్పించాలని కోరుతూ దుర్గామాత ప్రొక్లైన్ ఆపరేటర్ యూనియన్ ప్రతి నిధి డి.గోపాలం కోరారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్రమీనా తదితరులు పాల్గొన్నారు.

భద్రం కోనేరు పార్కు అభివృద్ధిపై నిర్లక్ష్యం


మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ

పలాస: ఉల్లాసపేట భద్రంకోనేరు పార్కును అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీనియర్ టీడీపీ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ అన్నారు. పాలకులు ప్రతిపక్ష టీడీపీ వార్డులపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. సోమవారం చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మునిసిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. 27వ వార్డులో ఉన్న భద్రం కోనేరును టీడీపీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హయాంలో 2014లో రూ.10 లక్షలతో అభివృద్ధి చేశామని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పార్కును నిర్వహణ చేపట్టకపోవడంతో దాని స్వరూపమే మారిందన్నారు. పార్కును అభివృద్ధి చేయాలని తాను అనేకమార్లు కోరినా ఫలితం లేకపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జంటపట్టణాలకు చెందిన అనేకమంది ప్రజలు పుణ్య కార్యాలకు ఇక్కడున్న చెరువును వినియోగించుకుంటారని, పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై చైర్మన్ బళ్ల గిరిబాబు మాట్లాడుతూ.. పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. జంటపట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ ఘోరంగా ఉందని, తాగునీటి సమస్యలు ఉన్నాయని, వేసవి రానున్న దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణాల్లో అనుమతులు లేకుండా ప్రకటన బోర్డులు పెడుతు న్నారని, దీనివల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా కమిషనర్ టి.నాగేంద్రకుమార్ స్పందిస్తూ.. రాజకీయ బోర్డులు ఎక్కువగా ఉంటున్నాయని, వీటిని తొలగించేందుకు అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు. చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ.. ఇకపై బోర్డులు ఏర్పాటు చేయాలంటే మునిసిపాలిటీ అనుమతి తప్పనిసరని, లేకుంటే తక్షణం తొలగించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు రావివలసలో అచ్చెన్నాయుడు పర్యటన

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు రావివలస, చిన్ననారాయణపురం గ్రామాల్లో పర్యటించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం

రోటరీనగర్(ఎల్.ఎన్.పేట): క్షేత్రస్థాయిలో ఈవీఎంల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఆర్.అప్పలరాజు అన్నారు. రోటరీ నగర్ పోలింగ్ బూత్‌లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని సోమ వారం ఆయన పరిశీలించారు. ఓటు వేసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈవీఎంలలో ఓటు వేసేటపుడు తాను ఏ గుర్తుకు ఓటు వేశారో గమనించాలన్నారు. ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియో గించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.గవరయ్య, పలువురు బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు గార్డెన్ మొక్కల వితరణ

ఈదులవలస(పోలాకి): పాఠశాలకు గార్డెన్ మొక్కలను ఎస్‌వీసీటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అందజేశారని ఈదుల వలస పాఠశాల ప్రిన్స్‌పాల్ పి.ప్రవీణ తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో 10 రకాలకు చెందిన 400 మొక్కలను నాటారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బొజ్జ జగన్నాథం, లయన్స్ క్లబర్ చైర్మన్ జామి చంద్రశేఖర్, ఎస్‌వీసీటీ కోర్డినేటర్ డి.రమేష్, పీడీ ఎం.నీలం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా

పోలాకి: మండలంలోని ప్రతీ పోలింగ్ కేంద్రంలో నూతన ఓటర్ల జాబితాను ఓటర్లకు, ప్రజాప్రతి నిధులకు అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ కంచరాన శ్రీరాములు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో 300 వరకు ఓటర్లు పెరిగారన్నారు. రాజకీయ పార్టీ నేతల సమక్షంలో ఓటరు జాబితాలను అందుబాటులో ఉంచామన్నారు. సచివాలయం, వీఆర్వోల వద్ద కూడా ఓటర్ల జాబితాలున్నాయని ఓటర్లు తమ పేర్లను సరిచూసుకోవాలన్నారు. ఆక్షేపణలుంటే వెంటనే తెలియజేయాలన్నారు.

నేడు పీఏసీఎస్ భవనం ప్రారంభం

పలాసరూరల్: పలాస మండల కాంప్లెక్స్ పరిధిలో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని మంగళవారం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సైల వెంకటరమణ తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

బైక్‌పై కన్నేశాడంటే అంతే

- 12 మోటారు సైకిళ్లు చోరీ ● నిఘా పెట్టి పట్టుకున్న పోలీసులు
- నిందితుడిది రణస్థలం మండలం

విజయనగరం క్రైం, జనవరి 29: పార్కింగ్‌లో ఉన్న బైక్‌లను కొద్దిసేపు జాగ్రత్తగా గమనిస్తాడు.. ఎవరూ రాకుంటే చాకచక్యంగా తాళం తెరిచి పట్టుకుపోతాడు. ఈ విధంగా 12 బైక్‌లను తీసుకుపోయి చోర కళలో ఆరితేరిపోయాడు. పోలీసులు నిఘా పెట్టడంతో అడ్డంగా దొరికిపోయాడు. అంతర్ జిల్లాల మోటారు సైకిళ్ల దొంగను విజయనగరం వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. డీఎస్పీ గోవిందరావు ఆ వివరాలను తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం తిరుపతిపాలెం గ్రామానికి చెందిన దుప్పాడ దుర్గాప్రసాద్ విజయనగరం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్ పోలీసుస్టేషన్‌తో పాటు పూసపాటిరేగ, భోగాపురం పోలీసుస్టేషన్ల పరిధిలో మోటారు సైకిళ్లు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అన్నిచోట్లా కేసులు నమోదయ్యాయి. ఎస్పీ ఆదేశాలతో బైక్ చోరీ కేసులపై పోలీసులు పూర్తి నిఘా పెట్టారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, సిబ్బంది పాత నేరస్థులపై ఆరా తీయడంతో పాటు జిల్లా కేంద్రంలో తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా దుర్గాప్రసాద్ అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పోలీసులు గమనించి అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారణ చేపట్టగా నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుంచి 12 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు విశాఖపట్టణం సిటీ పరిధిలో కూడా దొంగతనాలకు పాల్పడినట్టు డీఎస్పీ గోవిందరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో ట్రైనీ ఎస్పీ, సీఐ వెంకటరావు, ఎస్ఐ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

నాగావళి నదిలో పడి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం: నాగావళి నదిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని జబ్బావీధికి చెందిన జమ్మా ఎర్రయ్య(56) రామలక్ష్మణ కూడలిలో ఉన్న ఓ స్వీటు షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు నాగావళి నదికి వెళ్లగా, అదే సమయంలో మూర్ఛ రావడంతో మునిగిపోయాడు. ఎర్రయ్య ఎంతకీ రాకపోవడంతో అతడి భార్య చిన్నమ్మ నదికి వెళ్లి చూసింది. అప్పటికే స్థానికులు ఎర్రయ్యను ఒడ్డుకు తీసుకొచ్చి 108కు సమాచారం అందించారు. అప్పటికే ఎర్రయ్య మృతి చెందినట్టు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ ఎస్ఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చిన్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

ఆటో నుంచి జారిపడి ఒకరు..

మెళియాపుట్టి: కరజాడ గ్రామానికి చెందిన బమ్మిడి అన్నయ్య(54) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్వగ్రామం నుంచి నందిగాం మండలం హరిదాసుపురానికి ఆటోలో వెళుతుండగా వెనుకన కూర్చొన్న అన్నయ్య జారిపడ్డాడు. దీంతో అతడి తలకు బలమైన గాయమై మృతి చెందాడు. హరిదాసుపురంలో బంధువు మృతి చెందడంతో పరామర్శకు గ్రామస్థులతో కలిసి ఆటోలో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటో డ్రైవర్ అతివేగంగా వెళ్లడం వల్లే అన్నయ్య జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కరజాడ పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించినా అప్పటికే మృతి చెందాడు. అన్నయ్య పక్కనే కూర్చొన్న జగన్నాథం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు..

పొందూరు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం జరిగిన రైలు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు (సుమారు 24) మృతి చెందాడు. రైలు పట్టాలపై మృతదేహం గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైలులో వెళ్తూ ప్రమాదవశాత్తు ఆ యువకుడు జారిపడి మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. ఎరుపురంగు టీషర్టు నలుపురంగు నైట్‌ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్ఎన్ పేట: కోవిలాం కాలనీ వద్ద అలికాం-బత్తిలి రోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు మండలం దాశరథిపురం గ్రామానికి చెందిన నగరి కటకం లక్ష్మీనారాయణ, వరలక్ష్మి ద్విచక్రవాహనంపై సరుబుజ్జిలి నుంచి స్వగ్రామం వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ రోడ్డుపై పడిపోగా.. తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహ నంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గార: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలంటే సీఎంగా మళ్లీ జగన్‌నే గెలిపించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. గారలో సోమవారం ఉదయం నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ మార్పు దుర్గా పృధ్వీరాజ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మార్పు ధర్మారావు, ఎంపీపీ గొండు రఘురామ్, వైస్ ఎంపీపీ అంధవరపు బాలకృష్ణ, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

చట్టం అమలుకు చర్యలు

కొత్తూరు: మోటార్ వెహికల్ చట్టం పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహన యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, కారు సీటు బెల్ట్ తప్పకుండా ధరించాలని, లేకుంటే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. గ్రామాల్లో పేకాట ఆడితే సమాచారం అందించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అంత రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్టులో రూ.15 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా

అరసవల్లి: రీజియన్ పరిధిలోని విజయగనంలో గల 'సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీబీ సాయిశ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ 9 గంటలకు నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో టెన్త్ నుంచి పీజీ చదువుకున్న 18 నుంచి 30 ఏళ్ల వయసు గల యువతీ యువకులు అర్హులన్నారు. ఈ రీజినల్ జాబ్ మేళాలో 82 కంపెనీల్లో 5,849 ఉద్యోగాలకు ఎంపిక నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గలవారు డబ్లుడబ్లుడబ్లు. స్కిల్‌యూనివర్స్. ఏపీఎస్ ఎస్‌డిసి.ఇన్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 80994 61303, 79898 26953, 9014765287 ఫోన్ నెంబర్లులో సంప్రదించాలన్నారు.

వైసీపీని గద్దెదించాలి

బూర్జ: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని జనసేన పార్టీ నాయకులు కొత్తకోట నాగేంద్ర, కోరుకొండ మల్లేశ్వరరావు, కొల్ల జయరాం, విక్రమ్ పిలుపునిచ్చారు. లక్కుపురం గ్రామంలో ఆ పార్టీ ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం జనసేన పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్య క్రమంలో పార్టీ నాయకులు రుంకు అనంత్, లావేటి పృధ్వీ, బెహరా గణేశ్వరరావు, వారాడ పెంటయ్యనాయుడు, కడగల శ్రీను, ఒట్టికుట్టి గౌరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

కంచిలి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలతోనే ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ పి.దేవదాసు రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద పండించిన ఉత్పత్తులను స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయశాఖ యాంకర్ శివానందం, పశువైద్యులు శిరీష, అంపురం యూనిట్ ఐసీఆర్‌పీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

● **సోంపేట:** పలాసపురంలో ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల స్టాల్స్‌ను హైస్కూల్ వద్ద సోమవారం ప్రదర్శించారు. ఈ స్టాల్‌ను తహసీల్దార్ మోహనరావు, సర్పంచ్ తడక యశోద, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

సరుబుజ్జిలి: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని సరుబుజ్జిలి ఎస్ఐ కూటికుప్పల కృష్ణ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, సరుబుజ్జిలి జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు మాట్లాడుతూ.. 50 రోజుల జయాభవ కార్యక్రమం చేపట్టి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో రమేష్ సాహు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టండి

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న కిమిడి కళావెంకటరావు

ఎచ్చెర్ల: రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన వైసీపీని తరిమికొట్టాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు పిలుపునిచ్చారు. ముద్దాడ గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే 18 ఏళ్లు నిండిన మహిళకు ప్రతి నెలా రూ.1,500 అందజేస్తామన్నారు. ఈ ప్రాంతానికి జీవనాడి అయిన నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణ పనులు పూర్తిచేసి అన్నదాతను ఆదుకుంటామన్నారు. వైసీపీ పాలనలో ప్రజలకు ఒరిగేందేమీ లేదన్నారు. వైసీపీ ఎన్నికలకు సిద్ధమంటూ ప్రకటిస్తే... దీనికి విరుద్ధంగా సంసిద్ధత అంటూ ముందుకువచ్చారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ.. రానున్న ఎన్నిల్లో వైసీపీకి ఘోర పరాజయం తప్పదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, పార్టీ నేతలు వావిలపల్లి రామకృష్ణ, అన్నెపు భువనేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, గూరు జగపతిబాబు, పైడి అన్నంనాయుడు, అల్లుపల్లి రాంబాబు, మెండ రాజారావు, బల్లాడ అరుణ, సంధ్యా గజపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

అరసవల్లి: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో గల 7, 8, 9, 10 క్లస్టర్‌లకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ ఇన్‌చార్జీల శిక్షణ కార్యక్రమం నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ అధ్యక్షతన నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. వచ్చే నెలలో నారా లోకేశ్ జిల్లా పర్యటనకు వస్తున్నారని, కార్యకర్తలు, నాయకుల పనితీరును పరిశీలిస్తారన్నారు. శిక్షణట సురవరపు తిరుపతిరావు, చింతాడ వాసుదేవరావు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, రాష్ట్ర, జిల్లా అనుబంధ సాధికార సమితి నాయకులు, డివిజన్, యూనిట్, బూత్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి తీరు ప్రజలు గమనించాలి

- ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి: జగన్‌రెడ్డి పాలనా తీరుతో సామాన్యులు ఎంతగా ఇబ్బంది పడుతున్నారో ప్రజలు గమనించి, రానున్న ఎన్నికలలో బుద్ధి చెప్పాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో విధ్వంసకర పాలనతో రాష్ట్రం నష్టపోయిందన్నారు. మద్యపాన నిషేధం పేరిట ధరలు పెంచి సామాన్యుల చావులకు కారణమవుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో యుద్ధం మొదలైందని అందుకు టీడీపీ-జనసేన పార్టీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు రెడీగా ఉన్నారన్నారు. ఈయనతోపాటు మాజీ జడ్పీటీసీ చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

కొడుకులే పొమ్మంటే.. బతికేదెలా?

- 'స్పందన'లో వృద్ధ తల్లిదండ్రుల ఫిర్యాదు



స్పందన వద్ద విలపిస్తున్న వృద్ధ దంపతులు

కలెక్టరేట్: కొడుకులే తమను బయటకు పొమ్మంటే బతికేదెలానంటూ వృద్ధ దంపతులు సోమవారం కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. కోటబొమ్మాళి మండలం పెద్ద హరిశ్చంద్రాపురం గ్రామానికి చెందిన డోకి హరనాథం, లక్ష్మీకాంతం మాట్లాడుతూ 'గతంలో కలెక్టర్‌ను కలిసి మా ఆవేదన చెప్పుకున్నాం. సమస్య పరిష్కరించాలని గతేడాది డిసెంబరు 29న కలెక్టర్ ఆదేశించారు. అయినా ఆ ఆదేశాలను పట్టించుకునే అధికారులే కరువయ్యారు. గ్రామంలోని పెద్దలు, కులసంఘాల నాయకులు చెప్పినా మా కొడుకులు వినే పరిస్థితి లేదు. ఆస్తులు పంచగా మా పేరున మిగిలిన ఇంట్లోనే ఉంటామన్నా.. ఆ ఇంటికీ తాళాలు వేశారు. మా పేరున ఉన్న భూమిపై ఆదాయాన్ని వారే తీసుకుంటున్నారు. ఈ వయస్సులో ఎక్కడికి పోతాం. ఎలా బతుకుతామ'ని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను అభ్యర్థించారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



జేసీకి సమస్య వివరిస్తున్న చౌదరి బాబ్జీ

కలెక్టరేట్: స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వానికి తావు లేదని జా యింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 318 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్, డీపీవో రవికుమార్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డీఎస్‌వో వెంకటరమణ, డీఈవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆ ఓట్లును తొలగించండి

ఎస్ఎం పురం పంచాయతీ పరిధి సాయుధ పోలీసు క్వార్టర్స్ పోలింగ్ బూత్‌లో ఉన్న 854 ఓట్లు తొలగించాలని టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి (బాబ్జీ) కోరారు. ఈ మేరకు జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జేసీ ఎం.నవీన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. పోలీసు క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో అక్కడ ఎవరూ నివాసం ఉండడం లేదన్నారు. దీంతో సాయుధ సిబ్బంది ఓట్లను పనిగట్టుకొని కొంతమంది దొంగ ఓట్లు వేసే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల వీరి ఓట్లును తొలగించాలని కోరారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల: పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకే ఏటా మొబలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో సోమవారం సాయుధ సిబ్బందికి మొబలైజేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. శాంతి భద్రత పరిరక్షణలో కొత్తగా ఏర్పడే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సాయుధ సిబ్బందికి వినియోగపడేలా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ జె.తిప్పేస్వామి, సాయుధ డీఎస్పీ కేఎస్ నివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు డి.సురేష్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ మొబలైషన్ తరగతులు 15 రోజుల పాటు నిర్వహించనున్నారు.

నిత్యకృత్యంగా ఇసుక లారీల బోల్తా



ఆమదాలవలస: చెవ్వాకులపేట వద్ద వంశధార నది నుంచి తవ్వకాలు జరుపుతున్న ఇసుక రవాణ లారీలు బోల్తా పడడం నిత్య కృత్యంగా మారింది. చెవ్వాకులపేట వద్ద నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు నుంచి ఇసుక లోడుతో వస్తున్న లారీ సోమవారం తెల్లవారు జామున రామచంద్రాపురం గ్రామ సమీపాన పంట పొలంలో బోల్తాపడింది. దీనిని ఇసుక ర్యాంపు నిర్వాకులు క్రేన్ సాయంతో రోడ్డుపైకి తీసి యథావిధిగా ఇసుక వ్యాపారాన్ని కొనసాగించారు. ఈ ర్యాంపు నుంచి విశాఖ రవాణా చేస్తున్న ఇసుక లారీలు ఇదే రహదారిలో పలుమార్లు బోల్తా పడడంతో ఆ ప్రాంతాల వాసులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఇసుక ర్యాంపు నుంచి ఉదయం వేళ తవ్వకాలు ఆపాలని గతంలో అధికారులు ఆదేశించినా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు.

పోలీసు స్పందనకు 43 అర్జీలు

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 43 అర్జీలు వచ్చాయి. వీటిలో కుటుంబ తగాదాలపై ఆరు, చీటింగ్‌పై మూడు, ఆస్తి తగాదాలపై ఐదు, పౌర సంబంధమైనవి ఆరు, ఇతర తగాదాలపై 12, సైబర్ నేరాలపై ఆరు, పాత తగాదాలపై ఐదు ఫిర్యాదులు నమోదయ్యాయి. అర్జీలు స్వీకరించిన ఎస్పీ జీఆర్ రాధిక సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టి నివేదికలు అందించాలని ఆదేశించారు. ఏఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ఎచ్చెర్ల: బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని విద్యార్థులు సమయపాలన పాటించి తరగతులకు హాజరుకావాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాల్లోని వివిధ తరగతులను ఆమె సోమవారం పరిశీలించారు. అలాగే వర్సిటీలోని అన్ని కోర్సులకు జరుగుతున్న మిడ్ ఎగ్జామ్స్‌ను ఆమె పరిశీలించారు. వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

రణస్థలం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ కృషి చేస్తుందని ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు పున్నాన నర్సింహులనాయుడు అన్నారు. సోమవారం పున్నానపాలెం, అర్జునవలస, గిరివానిపాలెం, తిరుపతిపాలెం, సంచాం, కమ్మసిగడాం, యాగాటిపాలెం తదితర గ్రామాల్లో ఏపీటీఎఫ్ బృందం పర్యటించి ఉపాధ్యాయ సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు బొంతు అప్పలనాయుడు, వెలమల రమణ, బాలి సూర్యనారాయణ ఉన్నారు.

మంత్రి అప్పలరాజు ఫొటోలు చించివేసి నిరసన

- కుల ధ్రువ పత్రాలపై బెంతు ఒరియా కులస్థుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న బెంతు ఒరియా కులస్థులు



మంత్రి సీదిరి ఫొటోలు చించివేస్తున్న దృశ్యం

కంచిలి: ఎస్టీ కుల ధ్రువ పత్రాలు జారీ చేయాలని బెంతు ఒరియా కులస్థులు సోమవారం మండల కేంద్రంలో కంచిలిలో ఆందోళన చేపట్టారు. మరం కంచిలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి పాలకులపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యువకులు మంత్రి సీదిరి అప్పలరాజు ఫొటో ఉన్న పేపర్లను చించివేస్తూ నిరసన తెలిపారు. మంత్రులు సీదిరి, ధర్మాన, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలం నుంచి 2003 వరకు తమ కులస్థులకు ఎస్టీ కేటగిరిలో కుల ధ్రువ పత్రాలు జారీ చేసేవారిని, ఆ తర్వాత అధికారంలోనికి వచ్చిన అన్ని ప్రభుత్వాలు తమకు అన్యాయం చేశాయన్నారు. దేశంలో ఉన్న అన్ని కులాలకు చెందిన వారికి కుల ధ్రువ పత్రాలు ఇస్తున్నా, తమ కులానికి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. సంఘ నాయకులు రజనీకుమార్ దొళాయి, జగబంధు దొళాయి, దేవరాజ్ సాహు, భైరవి సాహు, సుమన్ బి.సాయి, గంగాసాహు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. జడ్పీటీసీ లోలాక్షి, కృష్ణారావు సంఘీభావాన్ని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కదంతొక్కిన ఆదివాసీలు

- టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం గేట్లు మూసేసిన పోలీసులు



పట్టణంలో గిరిజనుల భారీ ర్యాలీ

టెక్కలి: హక్కుల సాధన కోసం ఆదివాసీలు కదం తొక్కారు. సోమవారం డివిజన్ కేంద్రమైన టెక్కలి టెక్కలి- తెంబూరు రోడ్డు జంక్షన్ నుంచి గిరిజనులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సంప్రదాయ నృత్యాలతో సబ్ కలెక్టర్ కార్యాలయానికి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యాలయంలోకి వెళ్లకుండా ఎస్ఐ హేమంత్‌కుమార్, సిబ్బంది గేట్లను మూసివేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొంతసేపటికి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా వచ్చి ఆదివాసీ సంఘ నేతల నుంచి వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు, ఉపాధ్యక్షుడు వాబ యోగి మాట్లాడుతూ.. కుల రాజకీయాలు చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాంను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఆదివాసీలను దగా చేస్తున్నారని ఆరోపించారు. గిరిజనులు కాని కులాలను ఎస్టీ జాబితాల్లో చేరుస్తున్నారని విమర్శించారు. జిల్లాలో అసలు బెంతు ఒరియాలు లేరని, బెంతు ఒరియాలు ధర్నాలు చేయడం అవివేకమని, వారికి మద్దలిచ్చే నాయకులకు గిరిజనులంతా ఓట్లతో బుద్ధిచెబుతారని స్పష్టం చేశారు. నకిలీ బెంతు ఒరియా ధృవపత్రాలతో ఉద్యోగాలు చేస్తున్న సుమారు రెండు వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చవద్దన్నారు. బీసీ-ఏలకు చెందిన వడ్డి కులస్థులు ఎస్టీలెలా అవుతారని ప్రశ్నించారు. ఆదివాసీ సంఘ నాయకులు బూరాడ అప్పన్న, భైదిలాపురం సింహాచలం, సవర రాంబాబు, బెజ్జి కృష్ణ, యడ్ల సూర్యనారాయణ, చిన్నారావు, అనిరుద్రుడు, మాధవయ్య, గణేష్, జగన్‌దొర, భాస్కర్, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు స్టార్ క్యాంపెయినర్లు ఉండాల్సిందే



మాట్లాడుతున్న మాజీ మంత్రి గుండ

అరసవల్లి: వైసీపీ బాధితులను టీడీపీ స్టార్ క్యాంపెయినర్లుగా ముఖ్యమంత్రి జగన్ అభివర్ణించారని, ప్రజాస్వామ్యం నిలకడగా నిలబడాలంటే ప్రతీ రాజకీయ పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు ఉండక తప్పదని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ స్పష్టం చేశారు. సోమవారం తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నష్టపోయిన వాళ్లు, బాధితులు విశ్వసనీయత గల వ్యక్తులకు సహజంగానే మద్దతుగా ఉంటారని తెలిపారు. ఏ రాజకీయ పార్టీ ప్రజల విశ్వాసం, నమ్మకం పొందుతారో వారికి ప్రజలు రాజ్యాధికారం కట్టబెడతారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేసిన విమర్శను టీడీపీ అధినేత చంద్రబాబు సూటిగా అవునని సమాధానం చెప్పారన్నారు. టీడీపీ హయాంలో పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని చేపడితే దేశవ్యాప్తంగా ఇప్పుడు అన్ని ప్రభుత్వాలూ దీనినే అనుసరిస్తున్నాయన్నారు. వైసీపీ పాలనలో వేల కోట్ల రూపాయలు దోపిడీ చేయడమే ఒక విధానంగా చేసుకోవడం దారుణమని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియచెప్పే బాధ్యత, విద్యావంతులు, యువకులదేనన్నారు. డబ్బు, మద్యానికి ఓటు వేస్తే నీతిమంతులు, ఉత్తములైన నాయకులు అధికారంలోకి రాలేరని, రాష్ట్రంలో అటువంటి పరిస్థితి మళ్లీ జరగకూడదని, ఇది అందరి కర్తవ్యం అని తెలియజేశారు.

గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం నిర్వీర్యం

- నేడు సర్పంచుల నిరసన సదస్సు
- ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్



మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైసీపీ పాలనలో నిర్వీర్యమైపోయిందని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. నగరంలోని గాంధీ పార్కులో సర్పంచుల శాంతియుత నిరసన సదస్సు నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లాలో ఉన్న సర్పంచులంతా పార్టీలకతీతంగా హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గాంధీ వర్ధంతి నాడు జిల్లా కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేపడుతున్నామని, సర్పంచుల గోడు వినిపించేందుకు సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారని, అందరి సమస్యలను ఈ సదస్సులో చర్చించి కార్యచరణ ప్రణాళిక తయారు చేయనున్నట్టు తెలిపారు.

ఎస్ఈబీ ఏఎస్పీ బదిలీ

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఏఎస్పీ మణికంఠ బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలువురు ఐపీఎస్ అధికారులను సోమవారం రాత్రి ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్ఈబీ ఏఎస్పీ మణికంఠను విశాఖ లా అండ్ ఆర్డర్ డీసీపీగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

4న విశాఖలో ఓట్ ఫర్ ఓపీఎస్

జలుమూరు: ఓట్ పర్ ఓపీఎస్ నినాదంతో ఫిబ్రవరి 4న విశాఖ జీవీఎంసీ ఎదురుగా చేపడుతున్న సాగర సంగ్రామ దీక్షను విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు మెండ రామారావు కోరారు. స్థానిక ఎంఆర్‌సీ, ప్రభుత్వ బాలికల, బాలురు ఉన్నత పాఠశాలల్లో సోమవారం పోస్టర్లను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే వారం రోజుల్లోనే ఓపీఎస్‌ను పునరు ద్ధరిస్తానని హామీ ఇచ్చి నేటికీ ఐదేళ్లు కావస్తున్నా పునరుద్ధరణ చేయకపోవడం, సీపీఎస్ కంటే ఘోరమైన జీపీఎస్‌ను తీసుకురావడం దురదృష్టకరమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓపీ ఎస్‌ను పునరుద్ధరించే వారికే మా ఓటు నినాదంతో ఈ సాగర సంగ్రామ దీక్ష చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఈఈ జి.ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ పనులు చేయనున్న దృష్ట్యా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టౌన్‌తోపాటు గొల్లవీధి, వీకే పేట, రత్తకన్న పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

ఎచ్చెర్ల: దేశంలోని అత్యుత్తమ సాంకేతిక విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శివానీ ఇంజినీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండు షిఫ్ట్‌ల్లో కలిపి శతశాతం హాజరయ్యారు. వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో రెండు షిఫ్ట్‌లో 200కు 199 మంది హాజరయ్యారు. వచ్చే నెల 1వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జలుమూరు (సారవకోట): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీబీడీ సీఐ పైడపునాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. అంటరానితనం నివారించేందుకు ఎస్సీ ఎస్టీ చట్టం అమలులో ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దూషించిన, దౌర్జన్యం చేసిన వారిపై కేసులు నమోదు చేసి నెల రోజుల్లో డీఎస్పీతో దర్యాప్తు చేపడ తారన్నారు. నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, ఎస్ఐ అప్పారావు, సీబీడీ ఎస్ఐ గోపి, ఎంపీడీవో ఆర్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ కమిటీ ఎన్నిక

హిరమండలం: నియోజకవర్గ స్థాయి పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీని సోమవారం సుభలయ ఆర్‌ఆర్ కాలనీలోని గ్రేస్ బాప్టిస్ట్ చర్చిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పాస్టర్ డానియల్, కార్యవర్గ సభ్యులుగా రవికుమార్, బర్నబాస్, బాలరాజు, పీడీ రాజు, సీహెచ్ ఆశీర్వాదంలను ఎన్ను కున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కృపానందం, జనరల్ సెక్రటరీ సాల్మన్, అడ్వైజర్ బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.